ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 10-03-2026 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు.

2. కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేస్తోందని క్యాబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది.

3. ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం, సహకారం తప్పనిసరని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

4. అవయవ మార్పిడి లో మన రాష్ట్రం దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణను రూపొందించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

భట్టి విక్రమార్క

రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు సచివాలయంలో జరిగిన ప్రి బడ్జెట్ సమావేశంలో మంత్రులు

జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గడ్డం వివేక్ లతో కలిసి ఆయా శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ... అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులను ఉపాధి కల్పించే విధంగా రూపొందించాలన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ పాలసీకి అనుగణంగా వచ్చే పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్, ట్రైబల్ ఏజెన్సీల ద్వారా నిర్వహించాలని ఆదేశించారు.

జీఎస్

**క్యాబినెట్ సబ్ కమిటీ**

కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని క్యాబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. తెలంగాణ బ్రాండ్ కు తగినంత ప్రచారం వచ్చేలా మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని అదికారులను ఆదేశించింది. ఈరోజు సచివాలయంలో ఐటి మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండ సురేఖా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కరాల నిర్వహణ తేదీలు, భవిష్యత్ కార్యాచరణను సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

జీఎస్

**పొన్నం ప్రభాకర్**

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం కావడానికి ప్రజల సహకారం తప్పనిసరి అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రోంటాల సుహాసిని, వైస్ చైర్‌పర్సన్ గూడూరి అంజలిలకు

శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత కేవలం అభివృద్ధిపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. పట్టణ అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం తీసుకునే ప్రతి నిర్ణయానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, భద్రత, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ వంటి కీలక అంశాలపై దృష్టి సారించినట్లు మంత్రి వివరించారు. ముఖ్యంగా మహిళా సంఘాల సభ్యులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనికిరాని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

**( పీటీసీ, కరీంనగర్)**

**దామోదర్ రాజనర్సింహ**

హైదరాబాద్ లోని సచివాలయంలో ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ ఆక్ట్ (THOTA) పాలసీ రూపకల్పనపై, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈరోజు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అవయవ మార్పిడి చికిత్సలపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో మంత్రి చర్చించారు. అవయవ మార్పిడి చికిత్సలో మన రాష్ట్రం దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సామాన్యులకు సైతం అవయవ మార్పిడి చికిత్సలను భరించే విధంగా ధరల నియంత్రణ ఉండాలని ప్రైవేట్ యాజమాన్యాలకు సూచించారు.

జీఎస్

**మంత్రి పొన్నం ప్రభాకర్**

రానున్న వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని రైతు

వేదికలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ...

**సౌండ్ బైట్ మంత్రి పొన్నం ప్రభాకర్**

**పిటిసి, వరంగల్**

**బండారు దత్తాత్రేయ**

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈరోజు న్యూఢిల్లీ లోని పార్లమెంట్ భవనంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని మర్యాద పూర్వకంగా కలిశారు. హర్యానా రాష్ట్ర గవర్నర్‌గా పదవీ విరమణ చేసిన అనంతరం మొదటిసారి ప్రధానమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ... ఎన్డీఏ మొదటి మంత్రివర్గంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి గా, ఆ తర్వాత హిమాచల్ ప్రదేశ్, హర్యానా గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా “ప్రజల కథే నా ఆత్మకథ” పుస్తకాన్ని ప్రధానమంత్రికి అందజేశారు.

ప్రెస్ నోట్

**పొన్నం**

తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కనబరుస్తోందని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు బహిరంగ లేఖ రాసిన ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. పార్లమెంట్ లో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణకు రావాల్సిన నిధుల, పెండింగ్ ప్రాజెక్ట్ లపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్చించాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కు కేటాయిస్తున్న నిధుల్లో సగం నిధులైనా తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 2 ప్రాజెక్ట్ కు 24 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చవుతుందని, ఈ ప్రాజెక్టు కు 50 శాతం నిధులను కేంద్రం ఇవ్వాలని బహిరంగ లేఖలో ప్రస్తావించారు. హైదరాబాద్–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ కు కేంద్ర పరిశ్రమల శాఖ పూర్తి ఆమోదం

తెలపలేదన్న పొన్నం ప్రభాకర్.. 2013లో ప్రతిపాదించిన ఐటిఐఆర్ ప్రాజెక్టును తెలంగాణకు ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డెస్క్

**PRASAR BHARATI**

ప్రసారభారతి పీబీ-శబ్ద సేవ మీడియా సంస్థలకు లోగో లేని వార్తా కంటెంట్‌ను ఉచితంగా అందిస్తోంది. వీడియో, ఆడియో, టెక్స్ట్, ఫోటో వంటి వివిధ ఫార్మాట్లలో రోజు వెయ్యికి పైగా వార్తా కథనాలు అన్ని భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటాయి. పదిహేను వందలకు పైగా విలేకరులు, అరవై ఎడిట్ డెస్కులతో నిర్విరామంగా పనిచేస్తున్న ఈ సదుపాయం వచ్చే ఏడాది మార్చి వరకు ఉచితంగా అందుబాటులో ఉంటుందని ప్రసారభారతి ప్రకటించింది. మీడియా సంస్థలు shabd.prasarbharati.org వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

NSD

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన సర్పంచ్ లు, మున్సిపల్ వార్డ్ సభ్యులు, కార్పోరేటర్లు, ఛైర్మన్లు, మేయర్లకు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. ఈరోజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన సీఎస్... ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతోనే పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12 వేల 700 గ్రామ పంచాయతీలు, 110 మున్సిపల్ సంస్థలు ఉన్నాయని వాటిలో 15 వేల మంది ప్రజాప్రతినిధులు ఉన్నారని సీఎస్ వివరించారు.

జీఎస్

**రాజ్యసభకు ఏకగ్రీవ ఎన్నిక**

తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డిలకు పోటీగా మరెవ్వరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. దీంతో వారిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేంద్ర రెడ్డి ప్రకటించారు.

డెస్క్

**జీహెచ్ఎంసీ కమిషనర్**

హైదరాబాద్‌లోని ఐడిహెచ్ కాలనీ రూపురేఖలు మార్చాలని అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఆయా కాలనీలను జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, హౌసింగ్ ఎండీ గౌతమ్‌లతో కలిసి ఆయన సందర్శించారు. ఖాళీ స్థలాల్లో తక్షణమే పిల్లల పార్కులను అభివృద్ధి చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని ఆదేశించారు. గాంధీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై మెడికల్ ఆఫీసర్‌కు దిశానిర్దేశం చేశారు.

పిటిసి, హైదరాబాద్

**"సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్"**

తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్ మెంట్ ఈరోజు సికింద్రాబాద్ లోని సెంటిమేరీస్ కాలేజ్ లో యువతకు **"సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్"** కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అగ్నిమాపక శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ అరుణ బహుగుణ మాట్లాడుతూ... వైమానిక దాడులు, రసాయన దాడులు, అణు దాడులు, ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో ఈ వాలంటీర్ల సేవలు అన్ని ప్రభుత్వ విభాగాలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

**బైట్ ... అరుణ ఎం బహుగుణ**

ఫైర్ సర్వీసెస్ డైరెక్టరల్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి వీలైనంత ఎక్కువ మందికి ఈ శిక్షణ ఇచ్చేలా చొరవ చూపాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

జీఎస్

**ఇంటర్ పరీక్షలు**

రాష్ట్రంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు రెండో సంవత్సరం ఫిజిక్స్, ఎకనమిక్స్ పరీక్షల్లో 97.29 శాతం హాజరు నమోదైనట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలియజేశారు. మొత్తం 4 లక్షల 70 వేల 115 మంది విద్యార్థులకు గానూ.. 4 లక్షల 57 వేల 395 మంది పరీక్షలు రాశారని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు 9 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. వాటిలో నిర్మల్ జిల్లాలో మూడు, కరీంనగర్ జిల్లాలో ఒకటి, వరంగల్ జిల్లాలో 5 కేసులు నమోదైనట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

జీఎస్

**మహిళా దినోత్సవ వేడుకలకు ఆహ్వానం**

ఆసిఫాబాద్ జిల్లాలోని మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభకు రేపు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకలకు ఆహ్వానం అందింది. ఇప్పటికే గ్రామ పంచాయతీ లో జరిగిన అభివృద్ధికి ఐ ఎస్ ఓ సర్టిఫికెట్ పొందడంతో పాటు రాష్ట్రస్థాయి అవార్డులను పొందింది. తాజాగా రాష్ట్రపతితో మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం రావడంపై కనక ప్రతిభ సంతోషం వ్యక్తం చేశారు.

**ఆసిఫాబాద్ – పిటిసి**

**2వ వారంలో సూర్యాపేటలో సీఎం పర్యటన**

సూర్యపేట జిల్లాలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని ఈనెల రెండవ వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. కాలనీలో జరుగుతున్న పనులను ఈరోజు కలెక్టర్ తనిఖీ చేశారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.

పిటిసి, సూర్యాపేట

**పెద్దపల్లి**

ప్రజల భాగస్వామ్యంతో జరిగే అభివృద్ధే స్థిరమైన అభివృద్ధి అని రామగుండం శాసనసభ్యుడు ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. సమస్య వస్తే కేవలం ప్రజా ప్రతినిధుల కోసం ఎదురు చూడకుండా, ప్రజలే భాగస్వాములై అధికారులతో మాట్లాడి పరిష్కారం కనుక్కుంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈరోజు రామగుండం నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

పిటిసి, పెద్దపల్లి